ప్రతి ఇంటికీ సంక్షేమం

మంచికెప్పుడూ మన్నన దక్కుతుంది. చేసిన మేలును ఎవరూ మరిచిపోరు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విషయంలో ఇదే స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమం చూసి ఆయన పార్టీలో చేరామని 33వ వార్డుకు చెందిన ముస్లిం నాయకులు, కార్యకర్తలు చెబుతున్న మాటలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. పార్టీలకు అతీతంగా సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమంతో పేదల బతుకులకు భరోసా దొరుకుతుందని అంటున్నారు.

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 33వ వార్డులో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న 50 మందికి పైగా టీడీపీ ముస్లిం నాయకులు, కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జగనన్న ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందని కుటుంబం లేదని, గడప గడపకు కార్యక్రమంలో ఇదే విషయం స్పష్టమయిందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. నియోజకవర్గం పరిధి 33వ వార్డులో శనివారం వార్డుకు చెందిన 50 మందికి పైగా టీడీపీ ముస్లిం నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాల హోరుకు ప్రతిపక్ష టీడీపీ వైపు చూసే వాళ్లే లేరన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబం చల్లగా ఉంటుందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 175 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వాన్ని వదులుకునేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా తన కుటుంబ సభ్యులే అన్నారు. ఇక్కడ ఏ ఒక్కరికి కష్టం వచ్చినా వారికి అండగా తాను ఎల్లప్పుడూ ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. కష్టపడిన వారిని పార్టీ ఎప్పుడూ గుర్తుంచుకుంటుందన్నారు. ఎవరికీ అన్యాయం జరగదని ఆయన భరోసా కల్పించారు.

ముస్లింలకు అండగా వైఎస్సార్‌సీపీ..

ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముస్లింలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలబడిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ముస్లింలను గుర్తించలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక పథకాల ద్వారా పార్టీలకు అతీతంగా గడపలోనే సంక్షేమం అందిస్తుందన్నారు. వారి పథకాలు, పరిపాలనా విధానానికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో స్వచ్ఛందంగా వచ్చి చేరామన్నారు. ఇక నుంచి పార్టీ బలోపేతంతో పాటు, గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ ముస్లిం నాయకులు షేక్ అజీస్‌ఖాన్, హసీనా, అర్పి, బేగం, హుస్సేన్, మోదీన్, షీరిన్, మెహబూబ్, తాజ్, గౌశ్య, గోరి, ఫాతిమా, బాషా, నసీమా బేగం, పార్వతి, జ్యోతి, సంధ్య, గాయత్రి, తరుణ్ ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్టేట్ డైరెక్టర్ సకలాభక్తుల ప్రసాదరావు, బోణి దేవ, కొల్లి సత్యవతి, గంగ, తాడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ప్రభుత్వ వసతి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు గొంప చంద్రమౌళి ఎన్నికైన కార్యవర్గ సభ్యులను వైవీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు తక్షణం చెల్లించాలని కోరారు. దీనికి వైవీ సానుకూలంగా స్పందించి త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు అధ్యక్షుడు గొంప చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రొంగలి జగన్నాథం, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, సీహెచ్ ప్రసాద్, జి. వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ ఎంవీ సత్యనారాయణ, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి సత్కారం


వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని శనివారం పార్టీ నాయకులు దొడ్డి బాపూ ఆనంద్, కర్రి నీలకంఠం, పీతల వాసు, కొల్లి సింహాచలం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. పార్టీ బలోపేతానికి, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని సీట్లలో గెలిచేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చర్చికి మైక్ వితరణ


చర్చికి మైక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : మోర్చ చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోర్చ సన్యాసిరావు పెద్ద కుమార్తె భవిష్య (జెస్సీ) జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా చర్చికి రూ.17 వేలు విలువ గల హ్యాండ్ మైక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ భవిష్య ఆరోగ్యంతో పాటు ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, స్టేట్ ఫారెస్ట్ డైరెక్టర్ పీతల వాసు, మాదాబత్తుల రమేష్, బోణి దేవ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, అరుగుల రాజు, తమ్మినేని శ్రీను, బుల్లెట్ రవి, దూడ అప్పారావు, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- అన్నదమ్ముల మధ్య గొడవలో తమ్ముడిని కత్తితో పొడిచిన అన్న
- వారం రోజులుగా కేజీహెచ్‌లో చికిత్స

అల్లిపురం : అన్నదమ్ముల మధ్య గొడవలో తమ్ముడు ప్రాణాలు కోల్పోయిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం గత ఆదివారం జెండాచెట్టువీధిలో కారి లక్ష్మణ్ తన కుమార్తె మెచ్యూర్ ఫంక్షన్ నిర్వహించాడు. ఫంక్షన్‌కు పిలవటంతో అతని సోదరుడు కారి రాజేష్ గాజువాక జోగవానిపాలెం నుంచి తన కుటుంబంతో సహా వచ్చాడు. మరో సోదరుడు జెండాచెట్టువీధిలోనే ఉంటున్న కారి మహేష్ తన కుటుంబంతో కలిసి వచ్చాడు. ఫంక్షన్ అయిపోయిన తర్వాత రాజేష్, మహేష్ ఇద్దరు మద్యం సేవించారు. ఆ సమయంలో వారిద్దరి మధ్య మాటమాట పెరగటంతో వివాదం పెరిగిపోయింది. ఈ క్రమంలో రాజేష్ తన బండిలో గల కత్తితో మహేష్‌ను బలంగా పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బంధువులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. శనివారం మహేష్ చికిత్స పొందుతూ మరణించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.


ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

అల్లిపురం : బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గౌరీ సేవా సంఘం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఒమ్ని ఆర్కే ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రూహి ఇతర సిబ్బంది వైద్య పరీక్షలు చేపట్టారు. స్టాఫ్ నర్సులు మానస, భాగ్య, సిబ్బంది చంటి, గౌరినాయుడు, సమాజం ప్రతినిధులు భీశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే గృహాలు


ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : అర్హులైన లబ్ధిదారులకే గృహాలు కేటాయించనున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. హుద్‌హుద్‌కు సంబంధించి 500 ఇళ్లు మంజూరు కాగా, అర్హులైన 300 మంది లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 200 ఇళ్లకు సంబంధించి ఎలిజిబిలిటీ లేని వారిని తప్పించి అర్హులైన వారికి కేటాయించనున్నట్టు చెప్పారు. మరీ ముఖ్యంగా అర్హులై ఉండి పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న వారికి గృహాలు కేటాయించనున్నట్టు వెల్లడించారు.

సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్


సంపత్ వినాయగర్‌కు పూజలు చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సీతమ్మధార : శ్రీ వ్యాస మహా భారత లిఖిత గణపతి అలంకరణలోని ఆశీలమెట్ట శ్రీ సంపత్ వినాయగర్‌ను శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. అలయ పర్యవేక్షకులు గురుసు గోవింద్‌రెడ్డి మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు మోహన్‌స్వామి మంత్రి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంపత్ వినాయకుడి చిత్రపటాన్ని మంత్రికి ప్రధాన అర్చకుడు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్. బోశన్ పాల్గొన్నారు.

వెబ్ జర్నలిస్ట్స్ క్రికెట్ విజేత పరవాడ మీడియా వారియర్స్


విజేతలతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్

మహారాణిపేట : విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన కీ.శే. చిన్న వీడియో జర్నలిస్ట్స్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పరవాడ మీడియా వారియర్స్ జట్టు నిలిచింది. విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో మొత్తం 7 టీములు పాల్గొన్నాయి. శుక్రవారం సెమీఫైనల్స్‌లో వైజాగ్ వెబ్ వారియర్స్, పరవాడ మీడియా వారియర్స్ జట్లు పోటీ పడగా పరవాడ మీడియా వారియర్స్ విజేతగా నిలిచి సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. తర్వాత మ్యాచ్‌లో పెందుర్తి టీం గెలుపొంది సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో పెందుర్తి టీమును ఓడించి పరవాడ మీడియా వారియర్స్ ఫైనల్ కప్పును కైవసం చేసుకుంది. రన్నర్స్‌గా పెందుర్తి టీం నిలిచింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ చేతుల మీదుగా పరవాడ మీడియా వారియర్స్ జట్టు ఆటగాళ్లు కప్పును అందుకున్నారు. వెబ్ జర్నలిస్ట్స్ కమిటీ సభ్యులు రామకృష్ణ, మోహన్, అనిల్, సత్య సుధాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గ్రంథాలయం ఒక దేవాలయం

సీతంపేట: గ్రంథాలయం ఒక దేవాలయమని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–2 కె.వీర మణికాంత్ అన్నారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. లైబ్రరీ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ, ఉపాధ్యక్షుడు టి.ఎస్.ఆర్.ప్రసాద్ గ్రంథాలయంలోని అన్ని విభాగాలను ఆయనకు చూపించి, విద్యార్థులకు, పాఠకులకు కల్పించిన సదుపాయాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మణికాంత్ ప్రసంగించారు. సమాజానికి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతీ యువకులకు గ్రంథాలయం అద్భుతమైన బహుమతిగా పేర్కొన్నారు.

రవాణా రంగాన్ని దివాళా తీయించే జీవోలు రద్దు చేయాలి

సీతమ్మధార : రవాణా రంగానికి ఆర్థికంగా భారమైన 21,31 జీవోలను రద్దు చేయాలని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ చార్జీలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీఎం రమణ, కార్యవర్గ సభ్యులు పోలరెడ్డి, వెంకట్రావ్, శివాజీ, ఆర్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్స్ కేంద్రంగా శాసనసభ : గంటా

మహారాణిపేట: త్వరలో చంద్రబాబు నిర్దోషిగా బయటికి వస్తారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో ఎంతో మంది ఐఏఎస్‌లు ఉన్నా వారిని విచారించకుండా నేరుగా చంద్రబాబును అరెస్టు చేయడం హేయమైన చర్య అని తెలిపారు. అసెంబ్లీని మార్షల్స్ కేంద్రంగా తయారు చేశారని, 23 మంది టీడీపీ సభ్యుల కోసం 200 మంది మార్షల్స్‌ను పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల రక్తదాన శిబిరాలు


అవయవదానం కోసం నమోదు చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో

మహారాణిపేట: ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యవేక్షణలో నగరంలో పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం (భవానీ గార్డెన్స్)లో శిబిరం నిర్వహించి 14 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సిరిపురంలోని వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్‌లో 50 యూనిట్లు, విక్టోరియా ఆస్పత్రిలో 20 యూనిట్ల రక్తం సేకరించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ మెడికల్ స్టూడెంట్స్, కేజీహెచ్ బ్లడ్ సెంటర్ ద్వారా 50 యూనిట్లు, వన్‌టౌన్ ప్రాంతంలో శాంతి ఆధ్వర్యంలో విశాఖ బ్లడ్ సెంటర్ ద్వారా 13 యూనిట్లు, హుకుంపేట ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ ద్వారా 35 యూనిట్ల బ్లడ్ సేకరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వారి కార్యాలయ సిబ్బంది 9 మంది అవయవదానం చేసేందుకు అంగీకారం తెలిపగా.. వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

డాబాగార్డెన్స్ : అండర్–14 బాలికల కేటగిరీలో ప్రభుత్వ క్వీన్‌మేరీ బాలికల పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల సింహాచలంలో గల ఎంజేబీపీసీడబ్ల్యుఆర్ స్కూల్లో అండర్–14, 17 బాల బాలికల హ్యాండ్‌బాల్ సెలక్షన్స్‌కు సంబంధించి ట్రయల్స్ జరిగాయి. ఇందులో అండర్–14 బాలికల కేటగిరీలో ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సీహెచ్ నీహారిక, భార్గవి ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్నాథరావు, ఫిజికల్ డైరెక్టర్లు సంతోషకుమారి, జయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శిలాఫలాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డులోని జోన్–5 కార్యాలయం ఆవరణలో కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో బిషప్ మరియదాస్ కల్యాణ మండపాన్ని తొలగించి నూతన కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని భూమి పూజ చేశారు. సుమారు రూ.1.50 కోట్లతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. మరిన్ని నిధులు మంజూరైతే కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామని కార్పొరేటర్ పూర్ణిమ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభు, నాయకులు వేళంగిణిరావు, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, చుక్క శ్యామ్ సుందర్‌రెడ్డి, పాత్రపిల్లి సునీల్ కుమార్, శ్రీనివాస్, అమలావతి, వి.పద్మ, నారాయణరావు, వెంకటస్వామి, ప్రభాత్, కమల్‌కుమార్, చిన్నప్ప, రాయప్ప, లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ కళాశాల స్నాతకోత్సవం


ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న విద్యార్థిని

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన దాదాపు 300 మంది విద్యార్థినులు ఉపకులపతి చేతుల మీదుగా పట్టాలు, పతాకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ కాన్వకేషన్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉత్తమ విద్యతో పాటు విద్యార్థినుల సంరక్షణ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని కొనియాడారు. విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తున్న కళాశాల అధ్యాపకులను అభినందించారు. హిందీ విభాగాధిపతి, ప్రెస్ ఇన్‌చార్జి పి.కె. జయలక్ష్మి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1,2 తేదీల్లో మిరాకిల్ మెగా టాలెంట్ హంట్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ : గాంధీ జయంతిని పురస్కరించుకుని చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు అక్టోబర్ 1, 2 తేదీల్లో మిరాకిల్ మెగా టాలెంట్ హంట్ నిర్వహించనున్నట్టు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ ఆ రెండు రోజులు ఉదయం 9.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ వేదికగా పోటీలుంటాయన్నారు. ఫ్యాన్సీ డ్రెస్‌తో పాటు మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్, పెయింటింగ్, గెటప్స్, కోలాటం, ట్రెడిషనల్ డ్రెస్, ఫోక్ డ్యాన్స్ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయసుల వారు పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 9966485335 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


కృష్ణకుమార్ (ఫైల్)

అల్లిపురం : కేటరింగ్ చేస్తూ వేంకటేశ్వరమెట్టపై నివసిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎంజీఎం హై స్కూల్ వెనుక ఒక ఇంట్లో అద్దెకుంటున్న మందాన కృష్ణకుమార్ తన ఇంట్లో మృతి చెంది ఉన్నట్లు గుర్తించిన వారు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో అతని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. చనిపోయిన వ్యక్తి సుమారు 52 సంవత్సరాలు కలిగి, 5 అడుగుల 7 అంగుళాల ఎత్తు, నలుపు రంగు శరీర ఛాయ, బట్టతలతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 0891-278367, 9440904716, 8919812412 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

గణపతి సన్నిధిలో అన్నసమారాధనలు


అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న సీతంరాజు సుధాకర్, గోపీకృష్ణ తదితరులు


39వ వార్డులో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

అల్లిపురం : యువత దైవభక్తి కలిగి వుండాలని దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ అభిప్రాయపడ్డారు. వేంకటేశ్వరమెట్టపై గల ఆర్‌ఎక్స్–100 బాయ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ, శివకుమార్, సాయి, సురేష్, సతీష్, సంతోష్, యల్లపు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు పరిధి సరస్వతీ పార్క్ శ్రీలక్ష్మీ గణపతి స్వామి ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. అలాగే 29వ వార్డు పరిధి రామజోగీపేటలో స్థానిక మహిళలు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మన్యాల శ్రీనివాస్ పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

39వ వార్డులో : టీఎస్ కింగ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ పాల్గొని అన్న దానం చేశారు. టీఎస్ కింగ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవ్యాస మహాభారత లిఖిత గణపతి అలంకరణలో



సీతమ్మధార: ఆశీలమెట్ట శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో శనివారం శ్రీవ్యాస మహాభారత లిఖిత గణపతి అలంకరణలో సంపత్‌వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు.

డొమెస్టిక్ ఎంక్వైరీలో నైపుణ్యం అవసరం


డొమెస్టిక్ ఎంక్వైరీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామమూర్తి తదితరులు

సీతమ్మధార : డొమెస్టిక్ ఎంక్వైరీలో నైపుణ్యం అవసరమని ప్రముఖ న్యాయవాది కేవీ రామమూర్తి అన్నారు. ఒక హోటల్లో శనివారం సాయంత్రం జరిగిన ప్రముఖ న్యాయవాది, రచయిత వీవీ సత్యనారాయణ (బాలు) రచించిన ప్రాక్టికల్ వ్యూస్ ఆన్ డొమెస్టిక్ ఎంక్వైరీ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ ఎంక్వైరీలో నైపుణ్యం ఉంటేనే ఖాతాదారులకు పరిపూర్ణమైన న్యాయం జరుగుతుందన్నారు. పుస్తక రచయిత వీవీ సత్యనారాయణ (బాలు) మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో తన అనుభవాలను ప్రాక్టికల్ వ్యూస్ ఆన్ డొమెస్టిక్ ఎంక్వైరీ పుస్తకంలో పొందుపరిచానన్నారు. ఇది న్యాయ విద్యార్థులకు, న్యాయవాద వృత్తిని అవలంబిస్తున్న వారికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వి. సత్యవెంకటరావు, న్యూఢిల్లీ డీప్ ఓషన్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వి.రమణమూర్తి, సీనియర్ లా ఆఫీసర్ బీవీఆర్ శర్మ, ఎ.శశికిరణ్, వసంతరావు వెంకట రవి ప్రసాద్, పలువురు న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.